# నూలు చీర

- తమిరిశ జానకి

ఆ చుట్టుపక్కల అందరికీ అనసూయంటే వేళాకోళమే. ఆవిడ ఎదురుగా ఉన్నప్పుడు బురదలో రాయి వెయ్యటం ఎందుకని ఊరుకుంటారు గానీ... ఆవిడటు వెళ్ళగానే వాళ్ళల్లో వాళ్ళు నవ్వుకోకుండా ఉండరు.

తన పద్ధతే కరెక్టు, తన పిల్లలే గొప్ప, తన పిల్లల్ని మించిన వాళ్ళు ఈ ప్రపంచంలో లేరు అనుకుంటుందావిడ. ప్రతి పండక్కీ... అది ఏ పండగైనా సరే... కొడుక్కీ కూతురికి కొత్త బట్టలు కుట్టిస్తుంది. తనూ ఖచ్చితంగా ప్రతి సారీ కొనుక్కుంటుంది... అవన్నీ కూడా చాల ఖరీదైనవే తప్ప ఆమాత్రం ఈమాత్రం లాంటివి కంటికానవు. ప్రతి నెల పుట్టింటివాళ్ళు డబ్బు పంపాల్సిందే. లేకపోతే... ఏడుస్తూ ఫోన్లు... ఏడుస్తూ ఉత్తరాలు... ఇదీ వరస... అది భరించలేక పుట్టింటి వాళ్ళు విసిగిపోయి... వాళ్ళ అవసరాలు చంపుకుని నెలనెలా అనసూయకి డబ్బు పంపిస్తున్నారు. సొమ్మొకడిది సోకొకడిది అవుతోంది.

"రమణీ! ఈ పండక్కయినా నువ్వూ పిల్లలూ కొత్త బట్టలు కొనుకున్నారా? మీ ఆయన కొనను పొమ్మన్నాడా?" గాలి దుమారంలా పక్కింట్లో కొచ్చిన అనసూయ మాట్లాడుతూనే లోపలి గదిలోకి... వంటింట్లోకి గుడ్లగూబలా చూస్తోంది. ఎప్పుడూ అంతే... ఎవరింటికెళ్ళినా ఇదే తీరు... శల్య పరీక్షలు చేస్తున్నట్టు చూస్తుంది. తన మర్యాద తను నిలబెట్టుకోదు.

"రండి... కూచోండి." ఆవిడ తీరుకి చిరాకనిపించినా కుర్చీ చూపించింది రమణి.

తనకి కొత్త చీరంటూ కొనుక్కుని నాలుగేళ్ళవుతోంది. అయినా కూడా ఇప్పుడు కొనుక్కోవాలని ఏ మాత్రం అనుకోలేదు. పిల్లలకి కుట్టించి కూడా చాలా రోజులై పోయిందని వాళ్ళకి తీసుకుంది. నీక్కూడా తీసుకోమంటూ భర్త మరీమరీ బలవంత పెట్టడంతో తక్కువ ఖరీదులో కాస్త బావున్న నూలు చీరల్లోంచి నచ్చిన ఒక వాయిల్ చీర తీసుకుంది తనకోసం.

"నిన్న సాయంత్రం బజారెళ్ళారుటగా మీరు? రాత్రి మా అమ్మాయి చెప్పింది. ఏవీ? కొనుక్కున్నవి చూపించు."

మారు మాట్లాడకుండా లోపలికెళ్ళి కొత్త బట్టలు తీసుకొచ్చింది.

"ఏ షాపులో కొన్నారూ?"

"మన ఈవీధి చివరుంది కదా బట్టల కొట్టు? అందులోనే..."

"అంత చిన్న కొట్లోనా? నేనైతే పెద్ద పెద్ద షాపుల్లో తప్ప కొనుక్కోను. ఇవా కొన్నది?... వాయిల్ చీర కొనుక్కున్నావా ఉగాదికి? ఇంతకంటే కొని పెట్టనన్నాడా మీ ఆయన?" దీర్ఘం తీసింది.

మెడ పట్టుకుని బయటికి గెంటాలనిపించింది రమణికి.

కోపం దిగమింగుకుంది.

అప్పనంగా పుట్టింటి నించి రాబట్టుకోలేదు... మా ఆయన సంపాదనతో నాక్కావల్సింది కొనుకున్నాను... లోలోపలే అనుకుంది తప్ప పైకి ఏమీ మాట్లాడలేదు... కారణం.... బురదలో రాయి వెయ్యటం ఇష్టం లేక... ఈ మనిషికెప్పటికీ అర్థం కాదది... అర్థం చేసుకోదు కూడా...

"ఉండు... నేను కొనుకున్నది తీసుకొస్తాను. చూద్దువుగాని" గబగబా ఇంటికెళ్ళి తన కొత్త పట్టుచీర తీసుకొచ్చింది.

చేతిలోకి తీసుకుని చూసి బావుంది అంటూ చిరునవ్వుతో తిరిగి ఇచ్చేసింది రమణి.

అబ్బా! ఎంత బావుందో ఎంత ఖరీదైన చీరో అంటూ అసూయ పడిపోతూ చూస్తుందనుకుంది.

అదేమీ లేకపోవడంతో... ఇలా చూసి అలా ఇచ్చెయ్యడంతో మూతీ ముక్కూ తిప్పుకుంటూ ఇంట్లోకొచ్చింది.

అనుకున్నదొకటి అయినది ఒకటి
బోల్తా కొట్టిందిలే బుల్ బుల్ పిట్ట

బల్లమీద దరువేస్తూ హుషారుగా పాటందుకున్న భర్తని కొరకొరా చూసింది.

!+!+!+!

ఉగాది రోజు రమణీ, పిల్లలూ కొత్త బట్టలు కట్టుకున్నారు. అవి నూలు బట్టలైనా వాళ్ళ మొహాల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. పట్టు చీర కట్టుకున్నా కూడా అనసూయ మొహంలో ఆ వెలుగు లేదు... తన చీర కంటే ఖరీదైన పట్టుచీర ఎదురింటి కామాక్షి కొనుక్కుంది... అది కూడా చెన్నై నుంచి కొని తెచ్చుకుందన్న దుగ్ధ ఆవిడగారి మనసుని తొలిచేస్తోంది. ఇంక సంతోషం ఎక్కడా ఆ మనిషికి? మొహంలో చిరాకులూ చిటపటలూ తొంగి చూస్తున్నాయి.

నిధి చాలా సుఖమా రాముని సన్నిధి సుఖమా
బృందావనమది అందరిదీ గోవిందుడు అందరి వాడేలే
ఎందుకె రాధా ఈసు నసూయలు

కూనిరాగాలు తీస్తున్న భర్తమీద గయ్యిమని విరుచుకుపడింది.

"ఏవిటదీ అర్థం లేకుండా? శాస్త్రీయ సంగీతం సినిమా సంగీతం ఆ కలగలుపులేవిటి? పైగా పాట తెలియకపోతే ఊరుకోవచ్చుగా! ఈసు నసూయలు ఈసు నసూయలు అంటూ చిల్లుపడ్డ రికార్డులా ఏవిటా గోల?" చిర్రుబుర్రులాడింది. అటు కామాక్షి మీద మాత్రమే కాదు ఇటు భర్త గారి మీద కూడా మండుకొచ్చి. మండదూ మరి పాపం తల్చుకుంటే...

నా నంపాదనెంతో దాంట్లోనే గుట్టుగా నంసారం చేసుకోవడం నేర్చుకో అనసూయా...పెళ్ళయి ఇన్నాళ్ళయినా పుట్టింటి వాళ్ళని ఇబ్బంది పెట్టడం మంచి పద్ధతి కాదంటూ నీతిబోధలు చేస్తూ ఉంటాడయ్యె మరి...

"రెండు సంగీతాలూ కలిపితే మరో కొత్త సంగీతం పుడుతుందేమోనని చూస్తున్నాను".

"కొత్త సంగీతం కాదు.. పిచ్చి పుడుతుంది."

"అది వినే వాళ్ళ చెవుల సిరిని బట్టి ఉంటుందిలే"

"చెవుల సిరా? అదేవిటి?"

"అన్నం తినేటప్పుడు ఎప్పుడైనా నేను... ఈ కూరిలా ఉందేవిటి అనో, ఈ పచ్చడిలా ఉందేవిటి అనో అంటే... అది తినేవాళ్ళ దంతసిరిని బట్టి ఉంటుంది లెండి అంటావుగా... అలాగే ఇదీనూ.." సదరు భర్తగారిచ్చిన తమాషా జవాబుకి రుసరుసలాడుతూ ఎదురింటి వైపు నడిచింది.

కామాక్షి చీర చూసే దాకా కళ్ళూ కాళ్ళూ నిలవనంటున్నాయి మరి...

"ఏమ్మా కామాక్షీ చెన్నై వెళ్తున్నట్టు నాతో చెప్పకూడదా? చెప్తే నాకూ ఓ చీర తెప్పించుకునే దాన్నిగా నీచేత... మా పుట్టింటి వాళ్ళకో ఫోన్ కొట్టానంటే... వెంటనే నువ్వొచ్చేలోపల నా ఎకౌంటుకి డబ్బు పంపించే వారుగా! డబ్బులివ్వనేమో అనుకున్నావా?"

కామాక్షి కట్టుకున్న కొత్త పట్టుచీరని గుచ్చి గుచ్చి చూస్తూ దండకం చదివింది అనసూయ.

తెల్లబోయి చూసింది కామాక్షి.

ఆ వెంటనే ఒళ్ళూ మండింది.

ఈవిడ అథారిటీ మాటలేవిటి తనమీద?

ఊళ్ళో ఎవర్నీ వాళ్ళ పాటికివాళ్ళని బతకనివ్వదా ఈ మనిషి?

ఏదో పోన్లే తనకంటే వయసులో పెద్దది కదా అని ఊరుకుంటుంటే ఎక్కువై పోతోంది... ఒకింట్లో వాళ్ళమా ఏవన్నానా? ఇరుగు పొరుగు మీద ఈ అథారిటీ ఏవిటి?

"ఇంతకీ ఇదేనా నువ్వు కొనుక్కున్న చీర? ఇలాంటి రంగు తీసుకున్నావేంటి? ఇంకో మంచి రంగేదన్నా తీసుకోకపోయావా? బట్ట కూడా మరీ అంత నాణ్యంగా ఉన్నట్టు లేదే?"

నాకు నచ్చిన రంగూ, నాకు నచ్చిన చీరా నేను కొనుక్కుంటే మధ్యన ఈవిడ గోలేమిటి బాబూ! కామాక్షి మనసు గొణుక్కుంది.

"ఏవిటాలోచిస్తున్నావు?"

"అబ్బే! ఏం లేదండీ..."

"బయటికెళ్తున్నావా ఇప్పుడు?"

"ఔనండీ..."

"ఎక్కడికేవిటి?"

"ఏదో పనుంది... వెళ్ళాలన్నారు మావారు."

"ఇద్దరూ వెళ్తున్నారా?"

ఓరి నాయనో... జుట్టు పీక్కోవాలనిపించింది కామాక్షికి...

కానీ అలా బయటికెళ్తే బావుండదని ఆ ప్రయత్నం విరమించుకుంది.

!+!+!+!

రామాలయం శ్రీరామనవమి ఉత్సవ సందడితో చాలా హడావిడిగా ఉంది.

మధ్యాహ్నం సీతారాముల కల్యాణం...

ఇంట్లో పన్లు తొందరగా తెముల్చుకుని గుడికి బయల్దేరారు రమణీ అనసూయలు.

మొగవాళ్ళు పిల్లలు ఇంట్లోనే ఉంటామన్నారు.

అనుకోకుండా ఇద్దరూ ఉగాదికి కొనుక్కున్న చీరలు కట్టుకున్నారు.

"నువ్వేంటీ ఈ వాయిల్ చీర కట్టుకొచ్చావు?... కొత్తది కాకపోయినా ఓ సిల్కు చీరేదన్నా కట్టుకురాకపోయావా?"

ఎంతో సహనంతో జవాబిచ్చింది రమణి "ఈ చీర కట్టుకొస్తే గుళ్ళోకి రానియ్యడా దేవుడు? ఆ పట్టింపులేమీ లేవుగా దేవుడికి!"

"హయ్యో! నా మతిమరుపు పాడుగానూ!... ఇంట్లో వేసుకు తిరిగే హవాయి చెప్పులు వేసుకొచ్చేశాను. చెప్పులు మార్చుకోడం మర్చిపోయాను."

"పోన్లెండి... పర్వాలేదు... మర్చిపోయారు ఏం చేస్తాం... అడ్డ దోవనైతే తొందరగా వెళ్ళిపోతామని ఈ దోవన వెళ్దామన్నారుగా మీరు... అదుగో... ఇంకెంత.. వచ్చేశాం...?"

గబగబా నడుస్తున్న అనసూయ ఒక్కసారిగా అరిచింది అమ్మో అంటూ.

మట్టిలో నిటారుగా పైకి నిలబడున్న గాజు ముక్కొకటి అనసూయ అరికాల్లో గుచ్చుకుంది హవాయి చెప్పులోంచి దిగబడి.

ముందు తన చెయ్యి ఆసరా ఇచ్చింది రమణి. హవాయి చెప్పులోంచి ఆ గాజు ముక్క ఆగెయ్యాలని చూసింది గానీ అది రాలేదు. అటుపక్కగా ఉన్న ఓ పెద్ద బండరాయి మీద అనసూయని కూచోపెట్టి తను గొంతుక్కూచుని అరికాలు పరీక్షగా చూసింది. కాల్లో ఇంకే గాజు ముక్కా లేదు. దిగిన ఆ గాజు ముక్క హవాయి చెప్పులోనే ఉంది. కానీ... రక్తస్రావం ఆగట్లేదు. గుడిదాకా ఎలాగో అలా వెళ్ళిపోతే... అక్కడ నీళ్ళుంటాయి. కాలు కడగచ్చు. కానీ ఇంకో నాలుగడుగులు గుడిదాకా వెయ్యాలి కదా... మరింక ఆలస్యం చెయ్యలేదు రమణి... తన చీర కొంగుకి... పక్కనే మట్టిలో ఉన్న ఓ గట్టి పుల్లముక్కతో గంటుపెట్టి సర్రున చింపింది.

"అరే... అదేవిటి రమణీ. నీ కొత్త చీర అలా చింపేస్తున్నావేంటి?"

చిన్నగా నవ్వింది రమణి.

ఒత్తుగా ఎక్కువ మడతలు వేసి అనసూయ అరికాల్లో గట్టిగా కట్టు కట్టింది. "పట్టు చీర ఇలాంటి అవసరాలకి పనికిరాదు కదండీ మరి... అందుకే నా చీర చింపాను. ఇలా నా భుజమ్మీద చెయ్యివేసి నెమ్మదిగా నడవండి. ఇలా అడ్డదోవలో మనం రావడంతో ఏ రిక్షాలోనో వెళ్ళే ఛాన్సు కూడా ఇప్పుడు లేకుండా పోయింది మనకి. పాపం... కాలినొప్పితో మీరు నడవాలి. అదే నా బాధ."

"పోన్లే... ఇంకెంత... నాలుగడుగుల్లో గుడి రానే వాస్తోందిగా! నడుస్తాలే ఎలాగో అలా."

అడ్డదోవలో మనం రావడంతో అన్న రమణి మాట ఏదో గుర్తుకి తెచ్చినట్టయింది అనసూయకి.

నెలసరి జీతం తప్ప... ఆఫీసులో లంచాలేమీ తన భర్త పుచ్చుకోదని కస్సుబుస్సు లాడుతూనే ఉంటుంది తను.

దానికి సమాధానంగా తన భర్త ప్రతిసారీ అనేమాటే ఇప్పుడు చెవుల్లో మారుమోగుతోంది. "అడ్డదారిలో నడవడం నాకిష్టం లేదు... అడ్డదారిలో నడవడం నాకిష్టం లేదు".

రమణి మొహంలోకి చూసింది...

ఎన్నో రోజుల తర్వాత కొనుక్కున్న కొత్త చీరనిలా చింపవలసి వచ్చిందే అన్న బాధ ఆమె మొహంలో లేశమాత్రంగా కూడా కనిపించలేదు. చింపిన పైట కొంగుని దోపుకుంది పైకి కనిపించకుండా. ఆమె చీర ముందు తన చీర వెలాతెలా పోతున్నట్టనిపించింది. కానీ... అంతలోనే... వెలా తెలా పోయింది చీరకాదు తన అహంకారమే అన్న విషయం గ్రహింపుకొచ్చి సిగ్గుతో తలదించుకుని గుళ్ళో అడుగుపెట్టింది.

★☆★☆★